BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ 14-02-2025

WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు



విద్యార్థులకు గుడ్ న్యూస్

# 'యంగ్ ఇండియా' స్కూల్స్

- సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం
- ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటుకు చర్యలు
- స్థలాల గుర్తింపు ప్రక్రియ వేగిరం చేయాలంటూ ఆదేశాలు
- మంత్రి జూపల్లి, విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష

**మహా, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు విషయమై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గాలలో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ స్థలాల సేకరణ, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంద నియోజవర్గాల్లో నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలని అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గాల్లో స్థతాల కేటాయింపులు పూర్తయిన వాటికి అనుమతులకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. ప్రతిపాదిత స్థలాలు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. అనువైన స్థలం లేని చోట ప్రత్యామ్నాయ స్థలాన్ని సేకరించాలని తెలిపారు. స్థలాల గుర్తింపు ప్రక్రియ వేగిరం చేయాలి కలెక్టర్లు ఫీల్డ్ విజిట్ చేసి వీలైనంత త్వరగా స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి స్థలాల గుర్తింపు ప్రక్రియకు సంబంధించి వారం రోజుల్లో నివేదిక అందించాలన్నారు. ఇప్పటికే స్థల సేకరణ జరిగిన నియోజకవర్గాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టేలు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రెండేళ్లలో 105 నియోజకవర్గాల్లో అన్ని రకాల మౌలిక వసతుల వందశాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో ఆ స్థాయి ప్రమాణాలతో, సరైన మౌలిక వసతుల కల్పించాలని, ప్లే గ్రౌండ్, అకాడమిక్ బ్లాక్, ఇతర సౌకర్యాలను భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# బీజేపీలో వేధింపులు భరించలేకపోతున్నా..



- నాకు బ్రోకరిజం చేయడం రాదు..
- పార్టీకి తాను అవసరం లేదంటే తక్షణం రాజీనామా చేస్తా
- పార్టీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హాట్ కామెంట్స్


**మహా, హైదరాబాద్:** బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హాట్ కామెంట్స్ చేశారు. నాకు బ్రోకరిజం చేయడం రాదని, అందుకే పార్టీకి తాను అవసరం లేదని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు సూచించిన విధంగా అధ్యక్షుల ఎంపిక జరగకపోవడంతో కీలక నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే తాను సపోర్ట్ చేసిన నేతకు గోల్కొండ గోషామహల్ అధ్యక్ష పదవి ఇవ్వకపోవడంతో పార్టీపై మరోసారి సంచలన వ్యాఖ్యలు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల తాను పార్టీలో వేధింపులు తట్టుకోలేకపోతున్నానని రాజాసింగ్ కామెంట్ చేశారు. పార్టీకి తన అవసరం లేదని చెబితే ఇప్పటికిప్పుడే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తానని అన్నారు.

**పార్టీ వీడేందుకు సిద్ధం**

బీజేపీని వదిలి వెళ్లేందుకైనా తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పార్టీలో కొంతమంది చేస్తున్నట్లు తనకు బ్రోకరిజం చేయడం రాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. గోల్కొండ గోషామహల్ జిల్లా బీజేపీ అధ్యక్ష పదవిని బీసీ లేదా ఎస్సీ వ్యక్తికి ఇవ్వాలని సూచిస్తే.. కనీసం తనను పట్టించుకోకుండా ఎంఐఎం పార్టీ నేతలతో అంటకాగే వ్యక్తికి అధ్యక్ష పదవిని కట్టబెట్టారని ఫైర్ అయ్యారు. అలా చేశారని పార్టీలో ఉన్న ఓ ముఖ్య నేతను ప్రశ్నిస్తే.. నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని కామెంట్ చేశారు. తన నియోజకవర్గంలో కాకుండా హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే తాను కాంగ్రెస్ పార్టీతో యుద్ధం చేస్తున్నానని అన్నారు. గోల్కొండగోషామహల్ జిల్లా అధ్యక్ష పదవిని తాను సూచించిన వ్యక్తికి ఇవ్వకపోతే పార్టీకి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు.

# సేద్యంపై ప్రత్యేక దృష్టి

- వ్యవసాయాభివృద్ధికి బ్యాంకర్ల తోడ్పాటు అవసరం
- నాబార్డు స్టేట్ ఫోకస్ పేపర్ ఆవిష్కరణలో డిప్యూటీ సీఎం భట్టి




**మహా, హైదరాబాద్:** రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం నాబార్డ్ స్టేట్ ఫోకస్ పేపర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి తుమ్మలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ హైదరాబాద్ పరిసరాల్లో పూల సాగును నాబార్డు ప్రోత్సహించాలని అన్నారు. వ్యవసాయ పంపు సెట్లు క్రమంగా సోలార్ పవర్ పంపు సెట్లుగా మార్చేందుకు దృష్టిసారించాలి సూచించారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణను లీడర్ గా నిలపాలని అన్నారు. విరివిగా రుణాలివ్వండి: తుమ్మల రాష్ట్రంలోని వ్యవసాయ రంగ అభివృద్ధికి బ్యాంకర్లు మరింత సహకరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మార్కెటింగ్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించాల్సిన అవసరాన్ని బ్యాంకర్ల దృష్టికి తీసుకెళ్లారు. పశుపోషణ, మత్స్య పరిశ్రమ, కృషి ఆధారిత పరిశ్రమలు వంటి రంగాల్లో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, పోషకాహార భద్రతను మెరుగుపరచడం కోసం చిరుధాన్యాల సాగు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌కు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, నాబార్డ్ ప్రతినిధులు, బ్యాంకింగ్ రంగ ప్రముఖులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేసీఆర్, రేవంత్ ఇద్దరూ రండీ..

# మోదీ ఏం చేశారో చూపిస్తా


- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్
- వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే అంటూ వ్యాఖ్యలు



**మహా, హైదరాబాద్:** మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇద్దరూ రండీ.. మోదీ ఏం చేశారో చూపిస్తా.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వచ్చేది ఇక డబుల్ ఇంజన్ సర్కారేనని అన్నారు. గత పదేళ్లు తెలంగాణ మొత్తం కల్వకుంట్ల కుటుంబం చుట్టూ తిరిగేలా పరిపాలన చేశారని ఆరోపించారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. మార్పు రావాలని కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పదేళ్ళలో బీఆర్ఎస్ పై వ్యతిరేకత వస్తే కాంగ్రెస్ పార్టీపై పది నెలల్లోనే వ్యతిరేకత పెరిగిందన్నారు. "రాష్ట్రంలో మార్పు రాలేదు... మారింది సీఎం, పార్టీ జెండా మాత్రమే.. పరిపాలన మాత్రం అలానే ఉంది" అని అన్నారు. బీజేపీ మాత్రమే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తుందని తెలిపారు. బీజేపీ అభ్యర్థులు గెలిస్తే ప్రశ్నించే గొంతుకగా శాసనమండలిలో ఉంటారన్నారు. బీఆర్ఎస్ పార్టీ శాసనమండలిని నిర్వీర్యం చేసిందని వ్యాఖ్యలు చేశారు. అసలు శాసనమండలి ఉందా లేదా అన్న అనుమానం కలిగేటట్టు బీఆర్ఎస్ వ్యవహరించిందన్నారు. రాబోయే రోజుల్లో కొత్త ఇంటర్నేషనల్ స్కూల్ మాట దేవుడేరుగు ఉన్న స్కూళ్లకు రంగులు వేయలేని పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్, బీఆర్ఎస్ దెబ్బతీశాయని దుయ్యబట్టారు.

# నిజాయితీకి నిలువెత్తు రూపం సంజీవయ్య

## సీఎం రేవంత్‌రెడ్డి ఘన నివాళి



**మహా, హైదరాబాద్:** దేశంలో తొలి దళిత సీఎం స్వర్గీయ దామోదరం సంజీవయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం తన నివాసంలో దామోదరం సంజీవయ్య జయంతి నేపథ్యంలో ఆ మహనీయుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. నిజాయితీకి నిలువెత్తు రూపం, దళిత జాతి ఆత్మగౌరవానికి ప్రతిరూపమని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రి, పరిపాలనలో మేటి, వృద్ధులు, వికలాంగుల సంక్షేమ పెన్షన్లకు ఆద్యుడు అని సీఎం రేవంత్ రెడ్డి ఒక సందేశంలో పేర్కొన్నారు. సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన వారిలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు పటేల్ రమేశ్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలపై బీఆర్ఎస్‌ది కపట ప్రేమే..

- పదేళ్లు అగణదొక్కి ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారు
- సర్వే చేసి చిత్తశుద్ధి నిరూపించుకున్నా
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌రెడ్డి




**మహా, హైదరాబాద్:** పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం కుల గణన చేసినా.. లెక్కలు బయట పెట్టలేదని, సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేసి దేశానికే దిక్సూచిగా నిలిచారని, బీసీల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధి నిరూపితమైందని అని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తల సమష్టి కృషి వల్లే సర్వే సక్సెస్ అయ్యిందని అన్నారు. పార్టీలో కొంతమంది కార్యకర్తలు అసహనంతో ఉన్న విషయం వాస్తవమేనని, త్వరలోనే వారికి పూర్తి న్యాయం చేస్తామని అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ తో పాటు.. విద్య ఉద్యోగ లలో రిజర్వేషన్ చేయాలని ప్రభుత్వం తీసుకుందని అన్నారు. పదేళ్లు బీసీలను అణగదొక్కిన బీఆర్ఎస్.. ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

## బీసీలపై చిత్తశుద్ధి ఉంటే

# రాజీనామా చెయ్

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఈరవర్తి అనిల్ సవాల్



**మహా, హైదరాబాద్:** కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం తెలంగాణ మినరల్స్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవర్తి అనిల్ ఫైర్ అయ్యారు. ముస్లింలను బీసీలలో చేర్చితే ఊరుకోమని వ్యాఖ్యానించడంపై నోరు విప్పారు. కేంద్ర మంత్రి మాట్లాడే ముందు కనీసం మేధావులతో చర్చించి మాట్లాడితే బాగుండేదన్నారు. ముస్లింల కు రిజర్వేషన్ ఇస్తే ఒప్పుకోమని అంటున్నారని, కనీసం మండల్ కమిషన్ గురించి కేంద్రమంత్రి తెలుసుకోవాలన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని అన్నారు. బీసీల రిజర్వేషన్ పెంపుకు చట్టం చేయబోతున్నామని, కేంద్రంపై కలిసి ఒత్తిడి తెచ్చేందుకు కలసి రావాలని బండి సంజయ్‌ను అనిల్ సవాల్ చేశారు . హైదరాబాద్ వరదల సమయంలో బండి పోతే బండి.. కారు పోతే కారు ఇస్తామని అన్నారని, ఆ తర్వాత ఇన్సూరెన్స్ ఉంది కదా అన్నారని గుర్తు చేశారు అనిల్. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసి పోరాటం చేద్దామని అనిల్ సవాల్ విసిరారు.